
సాక్షి
అనంతపురం
ఆదివారం । 30 । జూలై । 2023



**చీనీ టన్ను రూ.21 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



**ఇట్లు..మీ 'శ్రేయో'భిలాషి**

బహుముఖ ప్రజ్ఞతో సమాజంలో గౌరవప్రద మైన జీవనం.. వలంటీర్‌గా ప్రజలకు సేవ చేస్తున్న ఓ ట్రాన్స్‌జెండర్ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/21.8°

జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. వాయువ్య దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



## న్యూస్‌రీల్

### ఇంజిన్ సమస్యతో తిరుపతి రైలు ఆలస్యం



రైలు దిగి వెళ్లిపోతున్న ప్రయాణికులు

కళ్యాణదుర్గం: ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో తిరుపతి ప్యాసింజర్ రైలు మొరాయించింది. కంబదూరు మండలం కదిరిదేవరపల్లి నుంచి కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా తిరుపతి బయల్దేరాల్సిన ప్యాసింజర్ రైలు శనివారం ఆగిపోయింది. మధ్యాహ్నం 3.50 గంటలకు రాయదుర్గం చేరాల్సిన రైలు బళ్లారి నుంచి తెప్పించిన మరొక ఇంజిన్‌తో రాత్రి 8.30 గంటలకు చేరుకుంది. దీంతో పలువురు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

### 'అనంత' విజయం



మమత



అర్షియా

అనంతపురం: నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరుగుతున్న సీనియర్ మహిళల క్రికెట్ టోర్నీలో అనంత జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. జట్టులో షేక్ సుహానా 45 పరుగులు, ఎస్.సాయిలక్ష్మి 41 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లలో పి.మనీషా, కె.మమత చెరో రెండో వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 47 ఓవర్ల వద్ద 211 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. జట్టు బ్యాటర్ మమత ఆల్‌రౌండర్ ప్రతిభతో జట్టును విజయతీరాలకు చేర్చింది. 145 బంతుల్లో 6 ఫోర్లతో ఆమె 69 పరుగులు సాధించారు. మరో బ్యాటర్ అర్షియా క్లాసికల్ డ్రైవ్‌లతో మెరిశారు. మొత్తం 101 బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 77 పరుగులు చేశారు.

# గూగూడు వైభవం

- జలధితో ముగిసిన మొహర్రం ఉత్సవాలు
- ప్రతిధ్వనించిన కుళ్లాయిస్వామి నామస్మరణ
- పీర్ల అగ్నిగుండ ప్రవేశం.. ఆసక్తిగా తిలకించిన భక్తజనం



గూగూడులో కుళ్లాయిస్వామి పీర్ల అగ్ని గుండ ప్రవేశాన్ని తిలకించేందుకు వచ్చిన భక్త జనం



కుళ్లాయిస్వామి పీర్ల ఊరేగింపు



సన్నాయి వాయిద్యాల నడుమ గ్రామోత్సవం



అగ్ని గుండంలో మొద్దులను పక్కకు తీస్తున్న దృశ్యం

నార్పల: కుళ్లాయిస్వామి నామస్మరణతో గూగూడు ప్రతిధ్వనించింది. మొహర్రం ఉత్సవాల్లో ముగింపు రోజున ముఖ్య ఘట్టాలైన అగ్నిగుండ ప్రవేశం, గ్రామోత్సవం శనివారం కనులపండువగా జరిగాయి. తొలుత భక్తులు పీర్లస్వాములు నడిచే అగ్నిగుండంలో నిప్పులను చదును చేశారు. ప్రధాన అర్చకుడు హుస్సేనప్ప పీర్లకు చక్కెర చదివింపులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సన్నాయి వాయిద్యాల మధ్య కొబ్బరి దివిటీల వెలుగులో కొండారెడ్డి వంశస్తులు కుళ్లాయిస్వామి పీరుతో సహా తొమ్మిది పీర్లను ఎత్తుకొని తెల్లవారు జామున రెండు గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిగుండా తిరిగారు. ఈ సందర్భంగా భక్తులు చక్కెర, బెల్లం, గంధాన్ని పీర్లపైకి విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటలకు అగ్నిగుండ ప్రవేశం చేశారు. మండుతున్న నిప్పుల్లోంచి పీర్లను ఎత్తుకున్నవారు అటు ఇటు వెళుతుండగా భక్తులు ఆసక్తిగా తిలకించి కుళ్లాయిస్వామి గోవిందా.. గోవింద అంటూ స్మరించారు. హిందువులు, ముస్లింలు భారీగా హాజరై మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. సాయంత్రం మూడు గంటలకు మరోమారు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చివరగా సమీపంలోని దిగుడుబావి వద్దకు పీర్లను తీసుకెళ్లి జలధోత్సవం పూర్తి చేశారు. ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో నిండిపోయింది. మేడలు ఎక్కి మరీ భక్తులు పీర్లను తిలకించి పులకించిపోయారు. పలువురు భక్తులు అన్నదానాలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, స్థానిక నాయకులు సూర్యనారాయణరెడ్డి, గోపాల్, ఆదినారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**రేపు చివరి దర్శనం.**

కుళ్లాయిస్వామి చివరి దర్శనం సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఉంటుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి శోభ తెలిపారు.



పీరుతో అగ్ని గుండ ప్రవేశం



కుళ్లాయిస్వామి పీరుతో అగ్నిగుండ ప్రవేశం చేసిన కొండారెడ్డి వంశస్తుడు



పీర్లను చూసేందుకు వస్తున్న మహిళలు



గూగూడు పరిసరాల్లో భక్తుల సందడి

# బాబూ.. జిల్లాకు రావొద్దు

- 14 ఏళ్ల పాలనంతా కరువు కాటకాలే
- మభ్యపెట్టే హామీలు ప్రజలు నమ్మబోరు
- ఎన్నికల్లో టీడీపీకి మరోమారు ఘోర పరాభవమే
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్ : కరువుకు ప్రతిరూపమైన చంద్రబాబు జిల్లా పర్యటనకు రాకూడదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. టీడీపీ పాలనలో 80 శాతం నిధులు ఖర్చు చేసి.. 20 శాతం పనులు కూడా చేయలేని ఆయన.. ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో పర్యటనకు రావాలనుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. శనివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 సంవత్సరాలూ కరువు కరాళ నృత్యం చేసిందన్నారు. దుర్మార్గుడు పాలిస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయన్నారు. నాడు పేరూరు డ్యాం, జీడిపల్లికి నీరు ఇస్తామని చెప్పిన టీడీపీ చుక్క నీరు కూడా తేలేకపోయిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు రిజర్వాయర్లకు నీరు తెప్పించామన్నారు. పేరూరు డ్యాం కింద పది వేల ఎకరాల్లో ఎనిమిది వేల ఎకరాలకు సాగునీ రందించడం గర్వంగా ఉందన్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు వైఎస్సార్‌సీపీ పాలనలో ఖజానా ఖాళీ అయ్యిందని, రూ.100 కోట్లు మాత్రమే మిగిల్చారంటూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధి – సంక్షేమం పరుగులు పెట్టిందని వివరించారు. మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ అమలు చేయడంతో పాటు సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ మేలు చేకూర్చారని తెలిపారు. అంతే కాదు నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని గుర్తు చేశారు. మంచి మనసున్న వారి పాలనకు ఇది నిదర్శనమన్నారు. అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, ఆయన మాటలు నమ్మడానికి ఎవ్వరూ సిద్ధంగా లేరన్నారు. వ్యవసాయ రుణాలు, బంగారంపై తాకట్టు రుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నిలువునా మోసం చేసిన విషయాన్ని ఎవ్వరూ మరచిపోలేదన్నారు. మరోసారి ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**నేడు నగరంలో ఉచితంగా 'అమ్మ' పాలు**


'అమ్మ' డెయిరీ శ్యాంపిల్ పాల ప్యాకెట్లను ఆదివారం అనంతపురం నగరంలో ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలోని పాడి రైతులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన 'అమ్మ' డెయిరీ ద్వారా సేకరించిన పాలను నేడు నగరంలో ప్రతి ఇంటికీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆది, శేఖర్, చిత్రా వెంకటేష్, చంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# జిల్లా సరిహద్దుకు తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాలు జిల్లా సరిహద్దులోకి ప్రవేశించాయి. జలాశయం నుంచి శుక్రవారం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు విడుదలైన నీరు శనివారం రాత్రి 9.30 గంటలకు ఆంధ్రా సరిహద్దు అయిన బొమ్మనహాళ్ మండలంలోని 105/272వ కిలోమీటర్ రెగ్యులేటర్ వద్దకు చేరుకున్నాయి. గంటకు 100 క్యూసెక్కుల మేర నీటి విడుదల పరిమాణం పెంచుతున్నారు. తుంగభద్ర జలాలు ఆంధ్రా సరిహద్దులోకి రావడంతో హెచ్చెల్సీ అధికారులు, ఆయకట్టు రైతులు ఆదివారం ఉదయం పూజలు చేసి స్వాగతం పలకనున్నారు. ఆదివారం రాత్రికల్లా కణేకల్లు చెరువుకు నీరు చేరుతాయని అధికారులు చెబుతున్నారు.

**భారీగా వరద**

ఎగువన కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. శనివారం 83,214 క్యూసెక్కుల వరద నీరు నురగలు కక్కుతూ డ్యాంలోకి వచ్చింది. ప్రస్తుతం 69.473 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ, రాయబసవన్న కాలువలకు 1,473 క్యూసెక్కులు వెళ్తున్నాయి.



హెచ్చెల్సీలో పారుతున్న తుంగభద్ర జలాలు

## మంత్రి తులాభారం



శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో శనివారం మొహర్రం ఉత్సవాల్లో భాగంగా పెద్ద సరిగెత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్యాలు ఆధ్వర్యంలో మంత్రి ఉషశ్రీచరణ్ బెల్లపు ఉండలతో తులాభారం సమర్పిస్తున్న దృశ్యమిది. - శెట్టూరు

# కిడ్నాప్ కలకలం

- అనంతపురంలో కర్ణాటక వాసి అపహరణ
- సర్పంచు ఎన్నికల నేపథ్యంలో ఘటన

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురంలో శనివారం కర్ణాటక వాసి కిడ్నాప్ కలకలం సృష్టించింది. ఇక్కడ ప్రత్యేక క్యాంప్‌లో తలదాచుకున్న ఓ వార్డుమెంబర్‌ను రెండు కార్లలో వచ్చిన ప్రత్యర్థి వర్గీయులు దాడి చేసి అపహరించుకుపోయారు. దాడి ఘటనలో బాధితుడి వర్గీయులు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన కిడ్నాప్ ఉదంతానికి సంబంధించిన వివరాలను త్రీటౌన్ సీఐ ధరణి కిషోర్, నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. కర్ణాటకలోని రాయచూరు మేజర్ పంచాయతీలో పూరుతిప్పలి, తురకందోణ, అలుకూరు గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీలో 16 వార్డు మెంబరు స్థానాలున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ పోటాపోటీగా అంటే చెరి ఎనిమిది స్థానాల్లో గెలుపొందాయి. గెలిచిన అభ్యర్థులు ఆగస్టు రెండో తేదీన సర్పంచ్, ఉప సర్పంచులను ఎన్నుకోవాల్సి ఉంది. సర్పంచ్ స్థానం కోసం జేడీఎస్ తీవ్ర ప్రయత్నాలు చేపట్టింది. వారికి ఆ చాన్స్ ఇవ్వకూడదని కాంగ్రెస్ పార్టీ తన వార్డుమెంబర్లను సురక్షితంగా కాపాడుకునేందుకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని శ్రీతేజా లాడ్జ్‌లో కాంగ్రెస్ వార్డు సభ్యులు నాగరాజు, తిప్పేనాయక్, లలీంద్ర, ఎల్లప్ప, బసిరెడ్డి, యేసు, రెడ్డెప్ప, వానేస్ బస చేశారు.

**పట్టపగలే దర్జాగా కిడ్నాప్**

లాడ్జికు సమీపంలోని రిటైర్డు డీఎస్పీ బాలనరసింహారెడ్డి ఇంటి ముందు హోటల్‌లో కాంగ్రెస్ వార్డు సభ్యులు టిఫిన్ చేసేందుకు వచ్చారు. అప్పటికే వీరి కదలికలపై నిఘా ఉంచిన ప్రత్యర్థి వర్గం రెండు కార్ల (ఇన్నోవా, ఆడీ)తో సిద్ధంగా ఉంది. వార్డుమెంబర్లలో ఒకరైన లలీంద్రను బలవంతంగా కారులోకి ఎక్కించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మిగిలిన వారిలో మరో ఇద్దరిని అపహరించేందుకు ప్రయత్నించగా.. వారు తప్పించుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలూ కూల్‌డ్రింక్ బాటిళ్లతో పరస్పర దాడులకు తెగబడ్డారు. లలీంద్ర వర్గీయుల్లో తిప్పేనాయక్, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం క్షణాల వ్యవధిలో ప్రత్యర్థి వర్గం వారు లలీంద్రను కిడ్నాప్ చేసుకుని కార్లలో కర్నూలు వైపు ఉడాయించారు. బాధితుడు తిప్పేనాయక్ ఫిర్యాదుతో కిడ్నాప్‌ను ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.



లలీంద్ర (ఫైల్)



గాయపడిన తిప్పేనాయక్

## క్లుప్తంగా

### రాయితీతో రైతులకు చాఫ్‌కట్టర్లు

- ఉమ్మడి జిల్లాకు 350 యంత్రాల మంజూరు



గడ్డి కత్తిరించే యంత్రాలు

అనంతపురం అగ్రికల్చర్: గడ్డి కత్తిరించే చాఫ్‌కట్టర్లను రాయితీతో పాడి రైతులకు అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఏడీ డాక్టర్ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం 'సాక్షి'తో వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాకు 350 చాఫ్ కట్టర్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు 200, శ్రీసత్యసాయి జిల్లాకు 150 యంత్రాలను కేటాయించినట్లు వివరించారు. వీటిని అర్హత కలిగిన పాడి రైతులకు 40 శాతం రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు హెచ్‌పీ సామర్థ్యం, మూడు బ్లేడులు కలిగిన ఒక్కో చాఫ్‌కట్టర్ పూర్తి విలువ రూ.33,970 కాగా, ఇందులో 40 శాతం రాయితీ రూ.13,588 పోనూ రైతులు తమ వాటా కింద రూ.20,382 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ వాటా చెల్లించిన రైతులకు నెల రోజుల్లోపే వారి గ్రామాల్లోనే ఆర్‌బీకే వేదికగా వీటిని అందజేస్తామన్నారు.

### గుట్కాలో బల్లి!



కళ్యాణదుర్గం: కుందుర్పి మండలం కరిగానిపల్లిలో ఓ యువకుడు కొనుగోలు చేసిన గుట్కా (విమల్)లో బల్లి అస్తికలు బయటపడ్డాయి. వివరాల్లోకి వెళితే.. శనివారం ఉదయం కుందుర్పిలోని ఓ చిరుదుకాణంలో నిషేధిత గుట్కాను ఆ యువకుడు కొనుగోలుజేసి, ప్యాకెట్ చించి చేతిలోకి వేసుకున్నాడు. అందులో బల్లి అస్తికలు రావడంతో ఆందోళనకు గురై దుకాణదారుడిని నిలదీశాడు. అయితే కర్ణాటక నుంచి గుట్కా తీసుకొచ్చి తాను విక్రయిస్తున్నానని, అందులో ఏముంటుందో తనకెలా తెలుస్తుందని దుకాణదారుడు పేర్కొనడంతో.. విషయాన్ని కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశాడు.

# ఇట్లు.. మీ శ్రేయోభిలాషి

- వలంటీరుగా రాణిస్తున్న ట్రాన్స్‌జెండర్
- ఉత్తమ సేవలతో ప్రజల ప్రశంసలు
- స్ఫూర్తిదాయకం..శ్రేయదాస్ జీవితం

**ట్రాన్స్‌జెండర్ అంటే సమాజంలో ఓ రకమైన చిన్నచూపు. 'మూడో' రకం మనుషులంటూ హేళనభావం. అనుచితంగా ప్రవర్తిస్తారని, బెదిరించి డబ్బు వసూలు చేస్తారనే అపవాదు. కానీ అందరు ట్రాన్స్‌జెండర్లూ అలా ఉండరు. మానవత్వం మూర్తీభవించి ఆపన్నులకు అండగా నిలిచేవారు, సమాజానికి సేవ చేయాలని తపన పడే వారూ ఉన్నారు. యాచనకు దూరంగా స్వశక్తితో హుందాగా, గౌరవంగా బతుకుతున్న వారూ ఉన్నారు. అలాంటి వారిలో శ్రేయదాస్ ఒకరు.**



వృద్ధురాలితో బయోమెట్రిక్ వేయిస్తున్న శ్రేయదాస్

సాక్షి, అనంతపురం డెస్క్: ఉరవకొండ పట్టణానికి చెందిన శ్రేయదాస్ గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నారు. తన క్లస్టర్ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రశంసలు చూరగొంటున్నారు. తన పనితీరుతో అధికారుల మన్ననలూ పొందుతున్నారు. ఈమె బహుశా రాష్ట్రంలోనే వలంటీరుగా పనిచేస్తున్న ఏకైక ట్రాన్స్‌జెండర్! గౌరవంగా బతకాలన్న దృఢ సంకల్పం, సమాజానికి సేవ చేయాలన్న తపనతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఎన్ని కష్టాలొచ్చినా ధైర్యంగా ఎదుర్కొన్నారు.

**'ఉన్నత' లక్ష్యం**

ఇంటి నుంచి బయటకొచ్చేసిన తర్వాత శ్రేయదాస్ పొట్ట నింపుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. మిగిలిన ట్రాన్స్‌జెండర్ల లాగా యాచించడం తనకు ఇష్టం లేదు. కానీ ఆకలి తీరాలంటే ముందున్న మార్గం అదొక్కటే. అయిష్టంగానే సుమారు మూడేళ్ల పాటు యాచనతో బతుకు నెట్టుకొచ్చారు. ఓ దుకాణం వద్దకు యాచించడానికి వెళ్లిన ఆమె ఇంగ్లిష్ నేమ్‌బోర్డును స్పష్టంగా చదవడాన్ని అక్కడే నిల్చొన్న ఓ వ్యక్తి గమనించారు. ఏమి చదివారంటూ ఆరా తీశారు. టెన్త్ చదివానని, పైచదువులు చదవాలన్న కోరిక ఉందని చెప్పారు. దీంతో గుంతకల్లులోని సత్యసాయి జూనియర్ కళాశాలలో అడ్మిషన్ చేయించారు. ఇంటర్మీడియట్ తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ (బీఏ) పూర్తి చేశారు. ఇదే యూనివర్సిటీలో పీజీ (ఎంఏ) అడ్మిషన్ పొంది ఫస్టియర్ ఉత్తీర్ణులయ్యారు. ఇతరత్రా కారణాల వల్ల సెకండియర్‌లో డిస్‌కంటిన్యూ అయ్యారు. తన చదువుకూ 'జెండర్' సమస్య అడ్డొచ్చినప్పటికీ పట్టుదలతో అధిగమించి ముందుకు సాగారు.

**హేళన చేసిన చోటే ప్రశంసలు**

గ్రామ/వార్డు వలంటీర్ల నియామక నోటిఫికేషన్‌లో ట్రాన్స్‌జెండర్లు కూడా దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో శ్రేయదాస్ దరఖాస్తు చేసుకున్నారు. ఆమె సంకల్పాన్ని గుర్తించిన అధికారులు గ్రామ వలంటీరుగా అవకాశం కల్పించారు. 2019 ఆగస్టు 15న గ్రామ వలంటీరుగా సేవలు ప్రారంభించారు. మొదట్లో తనను చాలామంది హేళన చేశారు. 'ఇలాంటి' వలంటీరునా తమకు కేటాయించిందంటూ ప్రజలు కూడా చిన్నచూపు చూశారు. కానీ అందరి అపోహలను ఆమె పటాపంచలు చేశారు. ఉత్తమ సేవలతో హేళన చేసిన చోటే ప్రశంసలు చూరగొంటున్నారు. ఈ క్రమంలో 'సేవామిత్ర' అవార్డు కూడా పొందారు. 'ఆపద మిత్ర'గా జిల్లాస్థాయి శిక్షణ తీసుకున్నారు. అందులోనూ మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు.

**కన్నీటి పయనం..**

శ్రేయదాస్ సొంతూరు ఉరవకొండ పట్టణమే. చిన్నప్పుడు అబ్బాయి లాగా ఉండేవారు. తల్లిదండ్రులూ అలాగే అనుకున్నారు. మిగిలిన అబ్బాయిలతో కలసి స్థానిక ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. పదో తరగతి వరకు అక్కడే చదివారు. కానీ తాను అబ్బాయిని కాదన్న విషయం శ్రేయదాస్‌కు తెలుసు. ఆ విషయం ఇంట్లో చెప్పాలంటే భయం. చివరికి ఎలాగోలా విషయం బయటపడింది. కొంతకాలానికి తల్లి కూడా చనిపోయింది. కుటుంబ సభ్యుల నుంచి ఛీదరింపులు ఎక్కువయ్యాయి. చివరకు తండ్రి కూడా అండగా నిలవలేదు. దీంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేశారు. తలదాచుకోవడానికి అద్దె ఇల్లు కూడా దొరకని పరిస్థితి. చాలా కాలం పాటు స్థానిక కందారమ్మ ఆలయమే ఆశ్రయమైంది.

**స్వశక్తితో జీవనయానం**

శ్రేయదాసుకు వలంటీరుగా గౌరవ వేతనంతో పాటు ట్రాన్స్‌జెండర్‌గా పింఛన్ కూడా వస్తోంది. ఇంట్లోనే టైలరింగ్ చేస్తున్నారు. యూట్యూబ్ ద్వారా మెలకువలు నేర్చుకుని బ్యూటీషియన్‌గానూ మారారు. ఇళ్ల వద్దకే వెళ్లి బ్యూటీషియన్‌గా సేవలందిస్తున్నారు. డ్వాక్రా సంఘం సభ్యురాలిగా ఉన్నారు. ఈమెకు ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి స్థలాన్ని కేటాయించింది. సొంతింటి నిర్మాణాన్ని ప్రారంభించారు.



**గౌరవంగా బతుకుతున్నా..**

వలంటీరుగా చేరినప్పుడు చాలామంది హేళన చేశారు. సొంత కమ్యూనిటీ నుంచి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. అయినా కొందరి ప్రోత్సాహం, అధికారుల సహకారంతో ధైర్యంగా ముందుకు సాగాను. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి మేడం, వీఆర్వో అరుణ మేడం సహకారం మరువలేనిది. మొదట్లో కాస్త ఇబ్బంది ఉన్నప్పటికీ ఇప్పుడు క్లస్టర్ పరిధిలోని ప్రజలు కూడా బాగా సహకరిస్తున్నారు. ఆత్మీయురాలిగా చూస్తుండడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో గౌరవంగా బతుకుతున్నా. ట్రాన్స్‌జెండర్లు అందరూ చెడ్డవారు కాదు. మాలోనూ మంచోళ్లు ఉన్నారు. కాబట్టి కొందరి ప్రవర్తనను బట్టి అందరినీ చెడ్డవాళ్లుగా ముద్ర వేయొద్దు. సమాజంలో గౌరవం, సమాన అవకాశాలు లభిస్తే నాలాగా స్వశక్తితో బతకడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారు.

– శ్రేయదాస్, గ్రామ వలంటీరు, సచివాలయం–3, ఉరవకొండ

## జిల్లా రిజిస్ట్రార్ హఠాన్మరణం



నాగభూషణం (ఫైల్)

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అనంతపురం జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న నాగభూషణం మృతి చెందారు. అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న ఆయన శనివారం ఉదయం వాకింగ్ ముగించుకుని ఇంట్లోకి వెళుతుండగా గుండెపోటుకు గురై మెట్ల మీద నుంచి కింద పడ్డారు. దీంతో తలకు, కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. కాగా, రాప్తాడు మండలం బుక్కచెర్లకి చెందిన ఆయన 1991లో గ్రూప్–2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగిగా చేరారు. సబ్ రిజిస్ట్రార్‌గా పామిడి, బుక్కపట్నంతోపాటు అనంతపురం డీఐజీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై రిజిస్ట్రార్‌గా కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో పని చేశారు. ఏడాది క్రితం అనంతపురం జిల్లాకు వచ్చారు. నాగభూషణం మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆ శాఖ డీఐజీ మాధవి నేరుగా ఆస్పత్రికి చేరుకుని రిజిస్ట్రార్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం నాగభూషణం భార్య నళినిని ఓదార్చారు.

## 11.88 లక్షల మొక్కలు నాటాలి



కలెక్టర్ గౌతమి


అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాకాలంలో 11.88 లక్షల మొక్కలు నాటి అడవుల పెంపకం చేపట్టాలని కలెక్టర్ గౌతమి సంబంధిత శాఖలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందుకు సంబంధించి సోషల్ ఫారెస్ట్రీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌బాలాజీని శనివారం ఆదేశించారు. రిజర్వు ఫారెస్టు పరిధిలో లక్ష మొక్కలు, డ్వామా పరిధిలో చేపట్టనున్న 150 కిలోమీటర్ల అవెన్యూ ప్లాంటేషన్ కింద 1.20 లక్షల మొక్కలు, విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో లక్ష మొక్కలు నాటాలని చెప్పారు. జిల్లాలోని జగనన్న కాలనీల్లో, పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో లక్ష మొక్కలు చొప్పున నాటాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు లక్ష మొక్కలు నాటడంతో పాటు 1.85 లక్షల మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 20 వేల మొక్కలు, దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలు, ఆలయ భూముల్లో 20 వేల మొక్కలు, డీఆర్‌డీఏ పరిధిలో 30 వేల మొక్కలు, వ్యవసాయ శాఖ, ఉద్యాయన శాఖల పరిధిలో బండ్ ప్లాంటేషన్‌లో 50 వేల చొప్పున మొక్కలు నాటాలన్నారు. ఎస్కేయూ, జేఎన్‌టీయూ, సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో 10 వేల మొక్కలు, ఇతర శాఖల పరిధిలో లక్ష మొక్కలు, ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో 3 వేల మొక్కలు నాటేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మొక్కల కోసం సంప్రదించండి..**

నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించాలని సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ చంద్రశేఖర్ చెప్పారు.

- ఎస్కేయూ, ఎఫ్‌టీసీ, ఆర్చిడ్, రాచానపల్లి, విడపనకల్లు, పెన్నహోబిలం, గార్లదిన్నె నర్సరీల్లో 3.35 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కల కోసం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునను (9491835163) సంప్రదించాలన్నారు.
- పుట్లూరు, శింగనమల, పెద్దవడుగూరు, బుక్కరాయసముద్రం, యల్లనూరు మండలాల పరిధిలోని నర్సరీల్లో 3.19 లక్షలు మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలోని వారు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డిని (9440949171) సంప్రదించాలన్నారు.
- పెద్దవడుగూరు, యాడికి, గుంతకల్లు, తాడిపత్రి మండలాల నర్సరీల్లో 4.63 లక్షలు మొక్కలు అందబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాలోని వారు మొక్కల కోసం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ దీపను (8317572080) సంప్రదించాలన్నారు.
- కుందుర్పి, రాయదుర్గం పరిధిలోని నర్సరీల్లో 3.08 లక్షలు మొక్కలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ బ్రహ్మయ్యను (9573446057) సంప్రదించాలన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య



మృతుడు మన్సూర్ అలి

గుంతకల్లుటౌన్/అనంపతపురం శ్రీకంఠం సర్కిల్: కుటుంబ సమస్యలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లులోని హనుమేష్ నగర్‌కు చెందిన షేక్ మన్సూర్ అలి (26)కి ఎనిమిది నెలల క్రితం పాత గుంతకల్లు ప్రాంతానికి చెందిన అలియాతో వివాహమైంది. ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరు నెలలు సజావుగా సాగిన వీరి కాపురంలో కుటుంబ కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో రెండు నెలల క్రితం భర్తను వదిలి అలియా తన పుట్టింటికి చేరుకుంది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో బాధపడుతున్న మన్సూర్ అలి శుక్రవారం రాత్రి మిద్దెపై నిద్రిస్తానంటూ వెళ్లాడు. శనివారం వేకువజామున పెద్దగా శబ్దం రావడంతో కుటుంబసభ్యులు నిద్రలేచి పైనున్న గదిలోకి వెళ్లి చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతూ గింజుకుంటున్న మన్సూర్‌ను కిందకు దించి, వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మన్సూర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి ఖుర్షీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

- మరో ఘటనలో అనంతపురంలోని ఆరో రోడ్డుకు చెందిన రామాంజనేయులు (42) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు భార్య రాధమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం ఓ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయమై అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ వస్తున్నాడు. దీంతో కుటుంబపోషణకు, చికిత్సకు తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కానరాక రోజూ బాధపడేవాడు. ఈ నేపథ్యంలోనే పిల్లలకు మంచి భవిష్యత్తు చూపించలేకపోతున్నాననే వేదన మరింత కుంగదీసింది. దీంతో శనివారం తెల్లవారుజామున ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

## కేంద్ర ప్రభుత్వ ద్రోహాన్ని నిలదీయండి : సీపీఎం

అనంతపురం అర్బన్: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదంటూ రాయలసీమకు ద్రోహం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయాలంటూ ప్రజలకు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక గణేనాయక్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్యతో కలసి ఆయన విడుదల చేసి, మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై అధ్యయనం చేయిస్తున్నామంటూ ఇంత కాలం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కాదంటూ చేతులెత్తేసిందని మండిపడ్డారు. ఐరన్ ఓర్ అత్యధికంగా లభ్యమయ్యే ఈ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ అనువు కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీ అధికారంలో వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రాయలసీమకు మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు చేపట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## వలంటీర్ దుర్మరణం



లింగమూర్తి (ఫైల్)

వజ్రకరూరు: ఐచర్ వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి పంచాయతీలోని పీసీ కొత్తకోటకు చెందిన బెస్త లింగమూర్తి (26) అదే గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఉరవకొండ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన లింగమూర్తి మార్గమధ్యంలోని పీసీప్యాపిలి సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వజ్రకరూరు పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

## ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంపు

అనంతపురం: ఏపీలోని రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ జగన్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలరావు జీఓ నంబర్ 59ను జారీ చేశారు. నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ గ్రేడింగ్ పెంపుదల, యూజీసీ నిధులు రాబట్టేందుకు వీలుగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లు పనిచేయడం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి సూచన మేరకు ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంపుదల చేశారు. గతంలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖ సెంట్రల్ వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంపుదల చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్న స్టేట్ వర్సిటీల్లోనూ ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంపుదల చేయాలని నిర్ణయించారు.

## వేమనపై కవితా సంకలనం

అనంతపురం సెంట్రల్: మహాకవి వేమనపై కవితా సంకలనం తీసుకురానున్నట్లు వేమన ఫౌండేషన్ కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేమన జీవితం, సాహిత్యం, తాత్వికత, గొప్పదనంపై ఇప్పటికే అనేక మంది ప్రముఖ కవులు, వీరబ్రహ్మం మొదలు గుర్రం జాషువా, బెళ్లూరి శ్రీనివాసమూర్తి, జంధ్యాల పాపయ్యశాస్త్రి లాంటి మహోన్నత వ్యక్తులు రాసిన పద్యాలు, కావ్యాలు, గేయాలు సేకరించినట్లు తెలిపారు. ఇతర బాషాల కవులు రాసిన కవితలను సైతం సేకరిస్తున్నట్లు వివరించారు. మారుమూల ప్రాంతాల్లో వెలుగులోకి రాని ఎన్నో పద్యాలు కవితా సంకలనంలో సమగ్రం చేర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎవరి వద్దనైనా అరుదైన పద్యాలు, కవితలు అందుబాటులో ఉంటే వాటి గురించి 99639 17187 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

## పార్టీ సభ్యత్వానికి టీడీపీ కౌన్సిలర్ రాజీనామా

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్ రాబర్ట్ షాక్ ఇచ్చారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన లేఖను నేరుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డికి పంపారు. ఏన్నో ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని, కష్టకాలంలో పార్టీ అభ్యున్నతికి పని చేసిన సీనియర్ నాయకుడు రాబర్ట్ కొన్ని రోజులుగా జేసీ ప్రభాకరరెడ్డి తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన ఒంటెద్దు పోకడలతో రోజురోజుకూ పార్టీ ప్రతిష్ట దిగజారుతుండంతో మనస్తాపం చెందిన ఆయన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిసింది.

## నేడు విద్యుత్ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లా విద్యుత్ ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఫలితాలను సాయంత్రంలోపు ప్రకటించనున్నారు. 11 మంది డైరెక్టర్లు ఉన్న సొసైటీకి వైఎస్సార్, ఓసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఒక ప్యానెల్ పోటీలో ఉండగా మరో ప్యానెల్‌లో 1104, 327 ఉద్యోగ సంఘాల సభ్యులు ఉన్నారు. మొత్తం 23మంది అభ్యర్థులు డైరెక్టర్ల స్థానాలకు పోటీ చేస్తున్నారు. అన్ని విభాగాల్లో 1,800మందికి పైగా ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## శ్రీశైలంకు పోటెత్తిన వరద

అనంతపురం సెంట్రల్: అనంతను తనువుతీరా ముద్దాడేందుకు తుంగభద్ర, కృష్ణమ్మ తహతహలాడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో శ్రీశైలం జలాశయానికి అత్యధికంగా 1,51,056 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 215.807 టీఎంసీల సామర్థమున్న శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 58.817 టీఎంసీలకు (838 అడగులు) నీటి నిల్వ చేరుకుంది. నీటి నిల్వ 850 అడుగులకు చేరుకున్న వెంటనే హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. కాగా, కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం ఉదయం 88,059 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 66.521 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇప్పటికే హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయడంతో ఇదివారం జిల్లాలోకి తుంగభద్ర జలాలు ప్రవేశించనున్నాయి. ఈ క్రమంలో హెచ్చెల్సీ ప్రధాన కాలువ 100వ కిలోమీటరు వద్ద గంగపూజ చేసేందుకు హెచ్చెల్సీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలత, ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. శనివారం విజయవాడలో వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు, ఎమ్మెల్సీల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డితో పాటు ప్రధాన కార్యదర్శి జి.సుధీర్, గౌరవాధ్యక్షుడు జాలిరెడ్డిని ఎమ్మెల్సీలు సన్మానించారు.

### ఇంటింటి సర్వే పక్కాగా చేయాలి



బీఎల్‌ఓల ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు దివాకర్‌రావు సూచించారు. నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న బీఎల్‌ఓలు చేస్తున్న ఇంటింటి సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడి మార్పులు, చేర్పులు చేపట్టాలన్నారు. 18 ఏళ్ల నిండిన వారు, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండేవారుంటే ఓటరుగా నమోదు చేయాలన్నారు.

### పెయ్య దూడలతో పాడి అభివృద్ధి



పశువైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సుధాకర్

రాప్తాడురూరల్: పాడి రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ అన్నారు. ఇందులో భాగంగా పెయ్య దూడల అభివృద్ధికి సంబంధించి ప్రవేశపెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన పశువుల్లో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 21 పశువులకు చికిత్స నిర్వహించారు. అనంతపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్వేత, డాక్టర్ వినోద్, డాక్టర్ సోమేశ్వరి, డాక్టర్ ఉష గోపాలమిత్రలు, ఏహెచ్‌ఏ పాల్గొన్నారు.

### 'బలజరాయ తరంగణి' ప్రసిద్ధి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్: బలిజల ఐక్యత, సమగ్రత కోసం డాక్టర్ ఎస్ఎస్ గిరిధరప్రసాద్‌రాయ్ రచించిన ' బలజరాయ తరంగణి' దక్షిణ భారతదేశమంతా ఎంతో ప్రసిద్ధి చెందిందని వక్తలు కొనియాడారు. శనివారం టవర్‌క్లాక్ సమీపంలోని ఓ కాన్ఫరెన్స్‌హాలులో రాయల్ లిటరరీ కల్చరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బలజరాయ తరంగణి తమిళ అనువాద గ్రంథంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు పాములరాయి వెంకటేష్, ఆదెన్న, భవాని రవికుమార్, గల్లా హర్ష తదితరులు పాల్గొని ప్రసంగించారు.

---

ఈ ఫొటోలోని వ్యక్తి పేరు కుందుర్పి మండలం ఎర్రబొమ్మెపల్లికి వీరాంజి. అనారోగ్యంతో సర్వజనాస్పత్రిలో చేరాడు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ప్రైవేట్ అంబులెన్స్‌లో వెళ్లాలంటే రూ.వేలల్లో వసూలు చేస్తారు. వీరి పరిస్థితిని చూసిన సర్వజనాస్పత్రి వైద్యులు 108 వాహనంలో కర్నూలుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. దీంతో ఈ నెల 25న అనంతపురం నుంచి కర్నూలుకు తీసుకెళ్లారు.



కుందుర్పి మండలం ఎర్రబొమ్మెపల్లికి చెందిన వీరాంజిని 108 వాహనంలో కర్నూలుకు తరలిస్తున్న దృశ్యం

ఈ ఫొటో చూడండి. రామగిరి మండలం కొండాపురానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తికి ఎద్దు దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. సర్వజనాస్పత్రిలో వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేయడంతో ఈ నెల 25న 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.



రామగిరి మండలం కొండాపురానికి చెందిన సుబ్బరాయుడును కర్నూలుకు తరలిస్తున్న దృశ్యం

# అయ్యో ఆపద..ఇదిగో రథం

అయ్యో..ఆపద అంటేనే గుర్తుకొచ్చేది 108 వాహనం.. ప్రమాదం జరిగినా, ఆపదలో ఉన్నా, ప్రసవాలకోసమైనా.. ఏ పరిస్థితిలో ఉన్నా.. 108కు కాల్ చేయగానే నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలానికి వాహనం చేరుకుంటుంది.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని పైసా ఖర్చు లేకుండా పేదలకు పెద్దదిక్కు అయిన సర్వజనాస్పత్రికి ప్రభుత్వాస్పత్రికి చేరుస్తోంది. చికిత్స పొందుతూ ఎవరైనా మృతిచెందితే మృతదేహాలను సొంతూళ్లకు చేరుస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 108 వాహనాలు 66 ఉన్నాయి. అనంతపురం 34, సత్యసాయి జిల్లాలో 32 వాహనాలు ఉన్నాయి. ప్రభుత్వం 108 వాహనాలు, మహాప్రస్థానం పేరిట అందిస్తున్న ప్రభుత్వ సేవలపై అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. – అనంతపురం క్రైం:

- ఆపద్బాంధవిగా 108 వాహన సేవలు
- ఫోన్ చేయగానే నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలానికి ..
- అనంత నుంచి కర్నూలుకు ఉచితమే..
- పైసా ఖర్చు లేకుండా జీజీహెచ్ నుంచి మృతదేహాల తరలింపు





మృతదేహాన్ని మహాప్రస్థానం వాహనంలో తరలిస్తున్న దృశ్యం

ఇలా ప్రతి నెలా ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి కర్నూలు ఆస్పత్రికి 30కిపైగా కేసులు రెఫర్ అవుతున్నట్లు 108 అధికారిక లెక్కలు చెప్తున్నాయి. కేసు తీవ్రతను బట్టి వెంటిలేటర్ సదుపాయం ఉన్న వాహనాల ద్వారా రోగులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సర్వజనాస్పత్రి నుంచి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి గుండె, న్యూరో, తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం రోగులను తరలిస్తున్నారు.

**పైసా ఖర్చుకుండా తరలింపు:**
ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ ఎవరైనా మృతి చెందితే సొంతూళ్లకు చేర్చేందుకు మహాప్రస్థానం వాహనాలు అవసరమవుతాయి. సర్వజనాస్పత్రి నుంచి కొన్ని నెలల్లో 436 కేసులను వివిధ ప్రాంతాలకు మహాప్రస్థానం వాహనం ద్వారా తరలించారు. జీజీహెచ్‌లో మూడు మహాప్రస్థానం వాహనాలు ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు వాహనాలు, రాత్రి 8 నుంచి ఉదయం 6 గంటల వరకు ఒక వాహనం అందుబాటులో ఉంటుంది. మృతదేహాలను తరలించడానికి వివిధ వార్డుల్లో ఉన్న స్టాఫ్‌నర్సుల ద్వారా రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లకు సమాచారం అందిస్తే డ్రైవర్లు పైసా ఖర్చు లేకుండా మృతదేహాలను తరలిస్తున్నారు.

**ప్రైవేట్ అంబులెన్స్‌ల దోపిడీకి చెక్:**
రోగులు, మృతదేహాలను తరలించడానికి ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో రోగులు పైసా ఖర్చు లేకుండా వైద్యులు, 108 సిబ్బంది నిర్ధారించిన ప్రాణాపాయ కేసులను కర్నూలు, అనంతపురం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. అదేవిధంగా మృతదేహాలను మహాప్రస్థానం ద్వారా తీసుకెళ్లే సౌకర్యం ఉంది.

### సద్వినియోగం చేసుకోవాలి



పేదలపై పైసా భారం పడకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. సర్వజనాస్పత్రిలో మెరుగైన అత్యవసర చికిత్సలు అవసరమున్న కేసులను కర్నూలుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మృతదేహాలను మహాప్రస్థానం ద్వారా స్వగ్రామాలకు చేర్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రిలోని రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల(ఆర్ఎంఓ)లను సంప్రదించాలి.
– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

---

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి సమీపంలోని కార్బన్ సిటీ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలంలోని పూలకుంటకు చెందిన కిరణ్‌కుమార్ వ్యక్తి గత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వెళ్లాడు. తిరిగి పూలకుంటకు బయల్దేరాడు. రుద్రంపేట మీదుగా వెళ్తుండగా కార్బన్ సిటీ దగ్గరకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనం ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

### 'శత'క్కొట్టిన వీరా



123 పరుగులు చేసిన వీరారెడ్డి

అనంతపురం: వైఎస్సార్ జిల్లా కడపలో జరుగుతున్న జోనల్ స్థాయి అండర్–19 క్రికెట్ టోర్నీలో అనంత బ్యాటర్ కోగటం వీరారెడ్డి చెలరేగాడు. 123 పరుగులతో అజేయంగా నిలిచి మరోసారి తన సత్తా చాటాడు. శనివారం జరిగిన మ్యాచ్‌లో సౌత్ జోన్‌పై టాస్ గెలిచి నార్త్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 72 ఓవర్లలో 238 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతపురం ఫాస్ట్ బౌలర్ ప్రదీప్‌రెడ్డికి మూడు వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్ చేసిన సౌత్‌జోన్ జట్టు 153 ఓవర్లలో 435 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టు ఓపెనర్‌గా బరిలో దిగిన కోగటం వీరారెడ్డి అద్భుతమైన ఆట తీరుతో 210 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 123 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం రెండో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్ జట్టు 30 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ, సౌత్‌జోన్ జట్టులోని అనంతపురం క్రీడాకారులు వీరారెడ్డి, ప్రదీప్ ప్రదర్శనకు ప్రశంసలు వెల్లువెత్తాయి.

### డీసీఈబీ కార్యదర్శిగా పురుషోత్తంబాబు



డీఈఓ సాయిరామ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం

రాప్తాడురూరల్: జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శిగా ఖాదర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పురుషోత్తంబాబును నియమిస్తూ డీఈఓ సాయిరామ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న లోకేశ్వరరెడ్డి ఇటీవల పదోన్నతిపై అన్నమయ్య జిల్లా పీలేరుకు వెళ్లారు. దీంతో ఖాళీగా ఏర్పడిన స్థానాన్ని భర్తీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీదేవి, లోకేశ్వరరెడ్డి, గురుప్రసాద్, శ్రీనివాసరావు, ఓబుళపతి పాల్గొన్నారు.

---

## శ్రేష్టమైన 'అమ్మ' పాలతో ఆరోగ్యం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ఎలాంటి లాభాపేక్ష లేకుండా 10 వేల మంది మహిళా పాడి రైతుల యాజమాన్యంలో స్వచ్ఛమైన, శ్రేష్టమైన పాలు అందిస్తున్నారు.. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి కుటుంబం అమ్మ డెయిరీ పాలు కొనుగోలు చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. శనివారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఔట్ పక్కన ఏర్పాటైన అమ్మ డెయిరీ నుంచి పాల శ్యాంపిల్ ప్యాకెట్లను పాపంపేట, కక్కలపల్లికాలనీ పంచాయతీ, రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీల్లో దాదాపు 10 వేల ఇళ్లకు ఉచితంగా అందించారు. డెయిరీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా తిరిగి శ్యాంపిల్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల ప్రాసెసింగ్, శ్యాంపిల్ ప్యాకెట్లను పరిశీలించారు. సాయంత్రం ద్వారకావిల్లాస్, బాలాజీవిల్లాస్‌లలో స్వయంగా ఎమ్మెల్యే, అహుడా చైర్మన్ మహాలక్ష్మిశ్రీనివాస్ శ్యాంపిల్ ప్యాకెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ డెయిరీ పాల నాణ్యతను ఒకసారి చూడాలని కోరారు. ఆదివారం నగరంలో శ్యాంపిల్ ప్యాకెట్లు అందజేస్తారన్నారు. పది రోజుల్లో లక్ష ఇళ్లకు శ్యాంపిళ్లు ఇస్తారన్నారు. అమ్మ డెయిరీ పాలు డోర్ డెలవరీ కూడా ఉందన్నారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్ణారెడ్డి, జేసీఎస్ రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మఠం శ్యాంసుదర్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, నాయకులు ఆకుల మునిశంకరయ్య, అపర్ణ పాల్గొన్నారు.



శ్యాంపిల్ పాలప్యాకెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి,అహుడా చైర్మన్ మహాలక్ష్మిశ్రీనివాస్

**అమ్మ డెయిరీ పాలు కొనుగోలు చేయండి**
రాప్తాడు: ప్రతి ఒక్కరూ అమ్మ డెయిరీ పాలు కొనుగోలు చేయాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. అనంతపురం రూరల్ మండలంలోని ఆలయూరు జగనన్న లేఅవుట్ వద్ద ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం అమ్మ డెయిరీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. శనివారం మండలంలోని చిన్మయనగర్, కళాకారుల కాలనీలో 2,500 కుటుంబాలకు అమ్మ డెయిరీ పాల ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఏపీఎం శివకుమార్ రెడ్డి, సీసీలు శ్రీరాములు, ఉమాదేవి, ప్రకాష్‌రెడ్డి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మహిళా సంఘాల యానిమేటర్లు ఉషారాణి, షాను, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

**'అమ్మ డెయిరీ'కి పాలు సేకరణ**
ఆత్మకూరు: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అమ్మ డెయిరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో అమ్మ డెయిరీ కలెక్షన్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం మండలంలోని సనప గ్రామంలో అమ్మ డెయిరీకి పాలు సేకరించారు.

## 'మనలో మనం' ఒక అద్భుత ఆలోచన



తొలి అడుగులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: 'మనలో మనం' సమూహం ఒక అద్భుతమైన ఆలోచన అని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అభివర్ణించారు. సాహితీ సృజనకారులు నిర్మలారాణి, సుజాత, బిజిలీ ఏర్పాటు చేసిన మనలో మనం వాట్సాప్ గ్రూప్ సమూహం నాల్గో వార్షికోత్సవం సందర్భంగా రాయలసీమ వ్యాప్తంగా పలువురు కవయిత్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శనివారం స్థానిక శారదా నగర్‌లోని ఆచార్య దేవకి స్వగృహంలో సందడిగా జరిగింది. నిర్మలారాణి నేతృత్వంలో గ్రూప్ సభ్యులు రచించిన 'తొలి అడుగులు' పుస్తకాన్ని రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ఆవిష్కరించగా, సీనియర్ రచయిత్రి శశికళ సమీక్ష చేశారు. ఆచార్య దేవకి రాసిన 'ఇర్లచెంగి కథలు' పుస్తకాన్ని డాక్టర్ అనంత మాలతీ ఆవిష్కరించగా, చేలూరి రమాదేవి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి, మాడుగుల సులోచనాదేవి, సీనియర్ కవి కంబదూరు నబీ రసూల్ పాల్గొన్నారు.

## 8 నుంచి భగవద్గీత సాధన శిబిరం

అనంతపురం కల్చరల్: రెవెన్యూకాలనీ రామాలయం, వివేకానంద యోగా కేంద్రం సంయుక్తాధ్వర్యంలో వచ్చే నెల 8 నుంచి 14 వరకు భగవద్గీత సాధన శిబిరం జరుగుతుందని నిర్వాహకులు రాజశేఖరరెడ్డి, దివాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెల్: 94402 88899, 9963028694లో సంప్రదించొచ్చన్నారు.

## ఘనంగా ధరణి 15వ వార్షిక మహాసభ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో టింబక్టు- కలెక్టివ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధరణి వ్యవసాయ సహకార సొసైటీ 15వ వార్షిక మహాసభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంస్థ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టం మాట్లాడుతూ 15 ఏళ్లుగా సేంద్రీయ వ్యవసాయంలో రైతులకు ధరణి సొసైటీ తోడ్పడుతోందన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, రొద్దం మండలాల్లో సేంద్రీయ వ్యవసాయ విధానంలో పంట సాగు చేయించి తమ సంస్థ వాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సొసైటీ అధ్యక్షులు అక్కులమ్మ, ప్రోగ్రాం మేనేజర్లు సుకన్య, శ్రీకాంత్, సీఈఓలు చిరంజీవి, నరసింహ, రమీజా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేరీవటమట్టం

# కమనీయం..దేవదేవుడి దివ్య దర్శనం





వెంకటేశ్వర స్వామి వైభవంలో భాగంగా స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



హారతిపూజలో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దంపతులు



స్వామి వారి ప్రసాదాలు స్వీకరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

అనంతపురం కల్చరల్: నగరవాసులు కలియుగ ప్రత్యక్ష దైవంగా పిలవబడే దేవదేవుడైన శ్రీనివాసుని దివ్య దర్శనంతో పులకించిపోయారు. శనివారం స్థానిక గుత్తిరోడ్డులోని ఓ ఫంక్షన్‌హాలులో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో తిరుమల నుంచి వచ్చిన అర్చకులు సుప్రభాత సేవ, అష్టాదశ పద్మార్చన, తిరుమంజనం, పుష్పయాగం, ఏడు శనివారాల వ్రతాలు, తిరుప్పాడ సేవ, తోమాలసేవలు నిర్వహించారు.'వైకుంఠవాసుడి సేవలో ఒక రోజు' పేరిట నిర్వహించిన క్రతువుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి ప్రతిమ, అనంత జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

**కమనీయం కల్యాణోత్సవం..**
సాయంత్రం కనులపండువగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవంతోపాటు సహస్ర దీపాలంకరణ, ఊంజల సేవ, పవళింపు సేవలు నేత్రపర్వంగా సాగాయి. వందల సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని కన్నులారా వీక్షించారు. అన్నప్రసాదాన్ని భక్తులకు మూడు పూటలా వితరణ చేశారు. రాత్రి జరిగిన శ్రీనివాస కల్యాణోత్సవంలో ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, నగర మేయర్ వసీం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి ఆదినారాయణరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు విజయ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది వెంకటసుబ్బారెడ్డి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, వివిధ సంఘాల నాయకులు వంకదారు వెంకటకృష్ణ, జయంతి శ్రీనివాసులు, శ్రీనిధి రఘు, దేవరకొండ కౌసల్య, మణూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన భక్తులు

# ముగిసిన మొహర్రం వేడుకలు



గొందిరెడ్డిపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు



ఆత్మకూరులో జలధికి తరలివెళ్తున్న పీర్లు



పీర్లను దర్శించుకుంటున్న మేయర్ వసీం

అనంతపురం సిటీ: ఐకమత్యానికి ప్రతీక మొహర్రం అని మేయర్ వసీం అన్నారు. నగరంలోని నాల్గో రోడ్డులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి మకాన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన మొహర్రం వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీర్లను దర్శించుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పానకాల చదివింపులోనూ పాల్గొన్నారు. కార్పొరేటర్లు ఇషాక్, శ్రీనివాసులు, నాయకులు ఖాజా, కిశోర్, ధను, రమణ, వాసు, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మొహర్రం వేడుకలు శనివారం ముగిశాయి. మండల కేంద్రంలో పీర్లను జలధికి తీసుకెళ్లారు. ఉదయాన్నే పీర్ల స్వాముల గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గుండంలోకి చెట్టు కొమ్మలను వేశారు. అనంతరం సాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పి. యాలేరు, సిద్ధరాంపురం గ్రామాల్లో పీర్లను జలధికి తీసుకెళ్లారు.

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. ముందుగా పీర్లకు పత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో రైతులు చెట్టుకొమ్మలను తీసుకొచ్చి పీర్లచావిడి ముందు ఏర్పాటు చేసిన గుండంలోకి వేసి, మొక్కులు తీర్చుకున్నారు. శనివారం తెల్లవారుజామున 7 గంటలకు పీర్లను గుండంలోకి దింపారు. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పీర్లను ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. భక్తులు బెల్లం ఉంటలు విసిరీ మొక్కులు తీర్చుకున్నారు. బోగినేపల్లి, ఎం.బండమీదపల్లి, మరూరు, పాలబావి గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శ్రావణశనివారం..భక్తజన పరవశం



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆలయాలు శ్రావణ శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బెంగళూరు రోడ్డులో ఉన్న శివబాలయోగి ఆశ్రమంలోని అనంతేశ్వర స్వామి ఆలయంలో లడ్డుపడిపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సహస్ర దళాలతో తులసీఅర్చన, పుణ్యనదీ స్నానాలు, అభిషేకాలతో నిలువెత్తు శ్రీనివాసుడు ప్రత్యేక పూజలు అందుకున్నాడు. ఆశ్రమ నిర్వాహకులు గుప్తా, దేవరాజ్ నేతృత్వంలో భక్తులకు లడ్డూ ప్రసాదాల వితరణ జరిగింది. ఆర్ఎఫ్‌రోడ్డు, రామనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో సామూహిక ఏడు శనివారాల వ్రతాలు కమనీయంగా జరిగాయి. వందల సంఖ్యలో భక్తులు బారులుతీరి వ్రతం ఆచరించారు. వివిధ రకాల పూజలతో గోవింద నామస్మరణ మార్మోగింది. స్థానిక హౌసింగ్‌బోర్డులోని అభయాంజనేయ స్వామి మూలమూర్తికి 500 కేజీల స్వచ్ఛమైన తేనెతో మధు అభిషేకం, వడమాల, తులసీదళార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.